
రాణీగారి కథలు
సలీం



# రాణీగారి కథలు

సలీం

Saleem_RaniGariKatalu.pm7 1 21/01/2009, 12:27 PM

# రాణీగారి కథలు

*('రచన' మాస పత్రికలో ధారావాహికంగా వెలువడిన సీక్వెల్ కథలు)*

## సలీం

*ముద్రణ :* డిసెంబరు, 2008

*ప్రతులు :* 1000

*వెల :* రూ. 100/-

*ముఖచిత్రం & లోపలి బొమ్మలు :* **కరుణాకర్**

*ప్రతులకు :*

**విశాలాంధ్ర బుక్‌హౌస్** – అన్ని బ్రాంచీలు

**నవోదయ బుక్‌హౌస్,** కాచిగూడ, హైదరాబాద్

**ప్రజాశక్తి బుక్‌హౌస్,** చిక్కడపల్లి, హైదరాబాద్

**సలీం,** ఫ్లాట్ నెం. 306, జె.బి. అపార్ట్‌మెంట్స్,

దోమలగూడ, హైదరాబాద్

*ముద్రణ :*

**శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్,** ఏలూరు రోడ్, విజయవాడ

# కథా క్రమం


| | |
|---|---|
| దద్ధోజనం | 5 |
| జగన్నాథ రథచక్రాలు | 13 |
| నిఖానామానే – మరో రూపం | 19 |
| నల్లటి జలపాతం | 25 |
| ప్రేమే దైవం | 31 |
| జాతస్య మరణం ధృవం | 37 |
| చేపల కూర | 44 |
| అలౌకిక రాజ్యం | 50 |
| ఆరో సూత్రం | 56 |
| అమృతం | 61 |
| మనసు పలికే మౌన భాష | 67 |
| మనసుకు లేదు మడి | 73 |
| పాత వాసన | 79 |
| వెల్తురు చెట్టు | 85 |
| బిరాదరీ | 93 |
| ఒక అబద్ధం | 99 |
| అంటరానివాళ్ళు | 106 |
| పాప నవ్వింది | 112 |
| మళయాళ మంత్రం | 118 |
| కలుపు మొక్కలు | 125 |
| మూడో మనిషి | 130 |
| మక్కా రామేశ్వరాలు | 136 |
| మైనారిటీ | 143 |
| ఆరడుగుల నేల | 149 |
| ఆకాశమే పందిరి | 155 |

‘రచన’ శాయి గారికి

అబ్బూరి ఛాయాదేవి గారికి

ఎలక్ట్రాన్ గారికి

కవనశర్మ గారికి

కృతజ్ఞతలతో . . .

– సలీం

# పద్దోజనం

**శర్మా డిగ్రీ కాలేజీ . . .**

**మొదటి రోజు కాబట్టి మూడో బెల్ కొట్టేలోపల క్లాస్‌రూంలోకెళ్ళాలనే తొందరలో వేగంగా నడుస్తూ . . . అంతే వేగంగా నా పక్కనుంచి వస్తున్న ఆ అమ్మాయి భుజానికి నా భుజం తగిలి ఆగిపోయాను.**

ఆ అమ్మాయి విసురుగా తల తిప్పి చూపుల్తో అగ్ని బాణాలు సంధించింది.

"కళ్ళు కన్పించడం లేదా? ఓ . . . పెద్దగానే ఉన్నాయిగా, అరచేయంత వెడల్పు. ఏం ప్రయోజనం? సైట్ ఉన్నట్టుంది. డాక్టరుకి చూపించుకో. మరోసారి ఇలా జరిగితే కళ్ళు పీకేస్తాను" అంది.

ఆమె మాటల హోరుకి బెదిరిపోయి "సారీ" అన్నాను. కానీ చూపంతా ఆమె తల తిప్పినపుడు సన్నటి ఆమె నడుంని వడ్డాణంలా చుట్టిన పొడవాటి జడవైపే ఉంది. ఎంత పెద్ద జడ!

ఎంత మందంగా ఉందో . . . మరికొద్దిగా పొడవుంటే మోకాళ్ళను తాకేంత...

అప్రయత్నంగానే 'ఎంత పెద్ద జడో' అన్నాను. ముందుకెళ్ళబోతున్న ఆమె ఆగి నా వైపు తిరిగింది.

"అది జడ కాదు. త్రాచుపాము. పిచ్చి వేషాలు వేస్తే కాటేస్తుంది జాగ్రత్త".

నాకు నిజంగానే భయమేసింది. ఈ పిల్లకు దూరంగా ఉండటమే అన్నిరకాలా శ్రేయస్కరం అన్పించింది.

అమ్మో . . . పిల్ల కాదు ఆటంబాంబు. చూట్టానికి పిచ్చుకలా ఉంది. ఐదడుగుల రెండంగుళాలకు మించని ఎత్తు . . . సన్నటి తీగలాంటి శరీరం . . . తెల్లటి దేహఛాయ . . .

క్లాస్‌లో మొత్తం ఎనమండుగురు ఆడపిల్లలు... మొదటి రెండు బెంచీల్లో సర్దుకున్నారు.

వాళ్ళ వెనక బెంచీలో నేను . . . పాఠాలు విసుగు పుట్టినపుడల్లా ఓ వ్యాపకాన్ని పెంచుకున్నాను– నా ముందు బెంచీలో ఉన్న ఆ అమ్మాయి పొడవాటి జడను చూడటం . . .

ఓ రోజు క్లాసులయిపోయాక నన్ను నిలేసింది.

"ఏవిటీ విషయం . . . నావైపే చూస్తున్నావట. లేదని బుకాయించకు. నాకు తెల్సు"

"నీ వైపు కాదు. నీ జడ వైపు"

"పిచ్చా నీకు? జడవైపు చూట్టమేమిటి?"

"పొడవాటి జడంటే నాకు బోల్డంత ఇష్టం"

"నా పేరు తెల్సుగా"

"తెలుసు. రాణి . . ."

"ఉత్త రాణి కాదు. నాగరాణి. నాగులకు రాణి. కాటేస్తే చచ్చి వూరుకుంటావ్. వళ్ళు దగ్గర పెట్టుకో"

"నా ఇష్టాఇష్టాలమీద నీ అజమాయిషీ ఏమిటి? నాకు పొడవాటి జడలంటే ఇష్టం. అందులో నా తప్పేమిటి" ఉక్రోషంగా అన్నాను.

"నీ ఇష్టం నీ దగ్గరే ఉంచుకో. నా జడవైపు చూడకు"

"నీ జడ పెద్దది కాబట్టి చూస్తున్నాను. చిన్నదిగా కత్తిరించుకో. చూడను"

"నా జడ నా ఇష్టం. నువ్వెవరు చెప్పటానికి?"

"నా చూపు నా ఇష్టం. నువ్వెవరు నియంత్రించడానికి"

రాణికి ఏం మాట్లాడాలో కొద్దిసేపు స్ఫురించినట్టులేదు. కొన్ని క్షణాల విరామం తర్వాత గొణుగుతున్నట్లు అంది.

"జడలు ఆడపిల్లల స్వవిషయం. నువ్వేమిటీ విడ్డూరంగా"

"మీరు జడపదార్థాలనే విషయం నిజమే. కానీ జడల అందాన్ని చూసి ఆస్వాదించడం మగపిల్లల జన్మహక్కు".

"ముళ్ళపూడి వెంకటరమణగారి పుస్తకాలు చదివావా?"

"అవును. నీకెలా తెలిసిందీ?"

"దద్ధోజనం"

"అంటే ఏమిటి?"

"ఏం లేదులే"

"నేను కవిత్వం కూడా రాస్తుంటాను"

"ఓ . . . అలా చెప్పు. నీ పైత్యానికి కారణం అదన్నమాట ! అసలీ జడల జబ్బు నీకెప్పుడంటుకుంది?"

"మా అమ్మకు జడేస్తున్నప్పుడు. మా అమ్మ జడ మూరెడు కూడా ఉండదు తెలుసా"



Saleem_RaniGariKatalu.pm7 6 21/01/2009, 12:27 PM



"నువ్వు జడేస్తావా?" వరద వెల్లువెత్తుతున్నట్లు నవ్వింది.

"నువ్వు నవ్వుతుంటే చాలా బావుంది" అన్నాను ధైర్యంచేసి.

"బావుంది నా నవ్వా"

"అదికాదు. నువ్వు నవ్వుతుంటే నా భయం కొద్దిగా తగ్గింది"

"మగపిల్లాడివి. భయమేంటి? అయినా నువ్వు జడవెయ్యడమేంటి?"

"మా అమ్మకు నలుగురు మగపిల్లల తర్వాత నేను పుట్టాను. ఐదో సంతానమైనా ఆడపిల్ల కావాలనుకుందట. తన కోరిక తీరలేదని చిన్నప్పుడు నాకు గౌన్లు తొడిగి అమ్మ మురిసిపోయేదట. అమ్మకు ఇంకెవరున్నారు? నేనే తలదువ్వి జడ వేస్తాను"

రాణి మరలా నవ్వింది. తెరలు తెరలుగా . . .

"మీ ఇంటికి తప్పకుండా రావాలి. నువ్వు జడ వేస్తున్నప్పుడు చూడాలి. ఇంతకీ మీ ఇల్లెక్కడ?" నవ్వుని ఆపుకోడానికిప్రయత్నిస్తూ అడిగింది.

"ఇస్లాం పేటలో"

"మీరు ముస్లింలా?"

"ఔను. నా పేరు సైఫ్ . . . సైఫుల్లా" అని కొన్ని క్షణాల విరామం తర్వాత ఆమె వైపు అనుమానంగా చూశాను.

"ఎందుకలా అడిగావు? ముస్లిం అని ముందే తెలిస్తే మాట్లాడేదానివి కాదా? మేము స్నేహం చేయడానికి పనికిరామా?"

నాగరాణి మొహంలో అనంతమైన ప్రశాంతత . . . కొన్ని నిముషాల ముందు కళ్ళలోంచి నిప్పులు చెరిగిన అమ్మాయి ఈ అమ్మాయేనా అని ఆశ్చర్యపోయేంత ప్రసన్నత . . . నిప్పులు చెరగటం అంటే రాణి ఒప్పుకోదేమో . . . బుసలు కొట్టటం అనాలేమో . . .

ఆమె సన్నటి పెదవుల మీద చల్లటి నవ్వు విచ్చుకుంది.

"నీ చేత ఇలా మాట్లాడించింది ఏమిటో తెలుసా? మైనారిటీలుగా ఉన్న ముస్లింలలో దాగున్న అభద్రతా భావం. హిందువులు ఎంతటి స్నేహశీలురో, ఎంతటి సహనశీలురో చరిత్రని పరిశీలిస్తే అర్థమౌతుంది. హిందువుల మంచితనం, మృదుస్వభావం వల్లనే ముస్లిం రాజులు కొన్ని వందల సంవత్సరాలు ఈ గడ్డమీద అధికారం చెలాయించగలిగారు. బ్రిటీష్ ప్రభుత్వం అన్నేళ్ళు మన మీద పెత్తనం చేయగలిగింది. హిందువుల కలుపుగోలుతనం వల్లనే మన దేశంలో ముస్లింలు హాయిగా, ప్రశాంతంగా ఉండగలుగుతున్నారు. కాదంటావా?"

ఆమె అనర్గళంగా మాట్లాడ్తుంటే ఎంత ముచ్చటేసిందో . . . లాయర్ కాగల



Saleem_RaniGariKatalu.pm7 8 21/01/2009, 12:27 PM

లక్షణాలు పుష్కలంగా ఉన్నాయనిపించింది. తన వాదనని ఎంత బలంగా విన్పించిందో . . .

"ఎంత చక్కగా చెప్పావో . . . ఒప్పుకుంటున్నా" అన్నాను మెచ్చుకోలుగా.

రాణి సిగ్గుపడ్తున్నట్లు నవ్వింది . . . క్షణమే.

ఆమె కళ్ళు వింత కాంతితో మెరుస్తున్నాయి.

"వూరికే మాటల వరకే పరిమితం అనుకోవద్దు. నేను సరైందని నమ్మినదాన్నే చెప్తాను. చెప్పింది ఆచరణలో పెడ్తాను. మనసా వాచా కర్మణా అంటారే. అలాగన్మాట. నువ్వన్నావే ముస్లిం అని తెలిస్తే మాట్లాడేదానివి కాదా అని . . . నాకు కులమతాల పట్టింపు లేదు. నాకే కాదు. మా యింట్లో ఎవ్వరికీ లేదు. మా యింటికోసారి రా. నీకే తెలుస్తుంది"

"మీ ఇల్లెక్కడ?"

"అగ్రహారంలో"

"అంటే మీరు బ్రాహ్మలా?"

"వైదీకులం. మాది నిప్పులు కడిగే వంశం. మా యింట్లో సనాతన ఆచారాలుంటాయి. వాటితోపాటు అధునాతన అభిప్రాయాలూ ఉంటాయి"

"నేను ముస్లిం అని తెల్సినా మీ అమ్మానాన్నలు నన్ను రానిస్తారా?"

"వచ్చి చూడు. మనం ముస్లింలమా, హిందువులమా అనేది ముఖ్యంకాదిక్కడ. మన సంస్కారం ముఖ్యం. మన మంచితనం ముఖ్యం. వీటిమీద పేటెంట్ రైట్ ఏ ఒక్క మతానికో, కులానికో లేదు. వచ్చే ఆదివారం మా యింటికి ఆహ్వానిస్తున్నాను. ముస్లింలు స్నేహానికి అర్హులు కారా అని అడిగావుగా. స్నేహానికి కావల్సింది మంచి మనసు. కల్మషంలేని హృదయం. నీకా క్వాలిఫికేషన్స్ ఉన్నాయని నమ్మితే మన స్నేహానికి నాందిగా ఆదివారం సాయంత్రం మా యింటికి రా"

ఇన్నాళ్ళూ ఆమె జడ అందాన్ని ఆస్వాదించిన నాకు, ఇప్పుడు ఆమె భావాల్లోని అద్భుతమైన సౌందర్యం అయస్కాంతంలా ఆకర్షించసాగింది.

ఆదివారం ఉదయం నుంచే టెన్షన్ . . . వెళ్ళాలా వద్దా? వెళ్ళకపోతే స్నేహానికి అవసరమైన క్వాలిఫికేషన్స్ నాలో లేవని ఒప్పుకున్నట్లవదా? వెళ్తే ఇబ్బంది పడ్తానేమో? వాళ్ళా బ్రాహ్మలు . . . నేనా ముస్లింని . . . దానికి తోడు పరమ మొహమాటస్థుణ్ణి...

సాయంత్రం కావస్తున్నా వెళ్ళాలా వద్దా అనే మీమాంస తీరలేదు. రాణి విసిరిన ఛాలెంజ్ పదే పదే గుర్తొస్తోంది. ముస్లింలయితే స్నేహానికి పనికిరారా అన్నానని రాణి మహా గడుసుగా 'అసలు నీలో స్నేహానికి అవసరమైన మనసుందో లేదో నువ్వే తేల్చుకో' అని ప్రతి సవాలు విసిరింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=183**